


RNI: APTEL/2010/36742

# న్యూస్ వార్

వార్తా పత్రిక

TELANGANA RISING GLOBAL SUMMIT

నల్లగొండ | epaper.news war.com | ఆదివారం 22, మార్చి 2026 | సంపుటి :16 సంచిక : 5 | ఎడిటర్: నటవా కృష్ణారావు | పేజీలు : 4 , వెల.2.00




## మొయినాబాద్ డ్రగ్స్ కేసు.. సిట్ బృందానికి చిక్కిన డ్రగ్ పెడ్లర్..

తెలుగు రాష్ట్రాల్లో మొయినాబాద్ డ్రగ్స్ కేసు సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. సిట్ దర్యాప్తు చేపట్టిన ఈ కేసు తాజాగా కీలక మలుపు తిరిగింది. డ్రగ్ పెడ్లర్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అభిషేక్ సింగ్‌ను సిట్ బృందం (రాxు ఎజూావీ) అదుపులోకి తీసుకుంది. నిందితుల్లో ఒక్కరైన కౌశిక్ రవి ఇచ్చిన సమాచారంతో నాలుగు బృందాలుగా ఏర్పడిన సిట్ ఎట్టకేలకు అతణ్ని పట్టుకుంది.

వార్త 2లో

# జీవన్‌రెడ్డికి పార్టీ అండ

వివరాలు 2లో..



ఎలాంటి నిర్ణయం తీసుకోవద్దని కోరాం

చర్చించిన అంశాలను పార్టీ, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తాం

జగిత్యాల ప్రాంతానికి జీవన్ రెడ్డి పెద్దదిక్కు

ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల గొంతుకగా ఉన్న నాయకుడు జీవన్ రెడ్డి

జీవన్ రెడ్డితో ముగిసిన మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్‌ల భేటీ

కాంగ్రెస్ నేత జీవన్ రెడ్డితో మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్‌ల భేటీ ముగిసింది. పార్టీ పెద్దల తీరుపై గత కొంతకాలంగా తీవ్ర అసంతృప్తితో ఉన్న జీవన్ రెడ్డి.. కాంగ్రెస్‌కు గుడ్ బై చెప్పి.. బీఆర్ఎస్ పార్టీలో చేరుతారనే ప్రచారం జరుగుతోంది. ఈనేపథ్యంలో జీవన్ రెడ్డిని కలిసిన మంత్రులు.. ఆయనను బుజ్జగించే ప్రయత్నం చేశారు. చాలా సమయం జీవన్ రెడ్డితో చర్చలు జరిపిన మంత్రులు.. పార్టీలో ఆయనకు సముచిత ప్రాధాన్యం దక్కేలా అధిష్ఠానం చూసుకుంటుందని హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. అయితే, వీరి బుజ్జగింపులు సఫలీకృతం అయినట్లుగా కనిపించడం లేదు. జీవన్ రెడ్డితో భేటీ అనంతరం మంత్రి శ్రీధర్ బాబు మీడియాతో మాట్లాడారు. పార్టీ మారే విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోవద్దని జీవన్ రెడ్డిని కోరామని మంత్రి తెలిపారు. జీవన్ రెడ్డికి పార్టీ అండగా నిలబడే ఆలోచన చేస్తుందన్నారు.



## గుడ్‌న్యూస్.. భారీగా తగ్గిన బంగారం ధరలు..

అంతర్జాతీయ మార్కెట్‌లో నెలకొన్న పరిస్థితుల కారణంగా భారత దేశంలో బంగారం ధరలు రోజురోజుకు భారీగా తగ్గుతున్నాయి. గుడ్ రిటర్న్ వెబ్‌సైట్ ప్రకారం.. నిన్న (మార్చ్ 20) హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ.1,48,910 రూపాయలు..

వార్త 2లో

## మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డికి షాక్..

బీఆర్ఎస్ నేత, తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డికి చెందిన ఫామ్‌హౌస్‌పై జరిగిన పోలీసుల దాడి, తదనంతర పరిణామాలు ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో పెను సంచలనం సృష్టిస్తున్నాయి. మొయి నా బాద్‌లోని అజీజ్‌నగర్ పరిధిలో ఉన్న రోహిత్ రెడ్డి ఫామ్‌హౌస్‌పై పోలీసులు ఆకస్మిక దాడి నిర్వహించారు. ఈ ఫామ్‌హౌస్ డ్రగ్స్ కార్యాకలాపాలకు నిలయంగా మారిందనే పక్కా సమాచారంతో పోలీసులు ఈ చర్యలు చేపట్టారు. మొయినాబాద్ పోలీసులు ఫామ్‌హౌస్‌ను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు.

వార్త 2లో



## ఏ ముఖం పెట్టుకుని సిద్దిపేటకు వస్తున్నావ్ రేవంత్: హరీశ్ రావు

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు బహిరంగ లేఖ రాశారు. సీఎం రేవంత్ రేపు(ఆదివారం) సిద్దిపేట పర్యటన నేపథ్యంలో పలు ప్రశ్నలు సంధిస్తూ లేఖ విడుదల చేశారు. రేపు సిద్దిపేట నియోజకవర్గానికి చేసిన ద్రోహం, నిధుల రద్దుపై ముఖ్యమంత్రి వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు హరీశ్ రావు. రేవంత్ ప్రారంభించబోయే అభివృద్ధి పనుల్లో ఏ ఒక్కటీ కాంగ్రెస్ ఇచ్చిందని లేదని.. అవన్నీ బీఆర్ఎస్ హయాంలో నిర్మించుకున్నవే అని తెలిపారు. శ్రమ ఫలితం మాది, శిలాఫలకాలు మీవా? అంటూ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

వార్త 2లో





## 4 వేల కిలోమీటర్ల దూరంలోని యూఎస్ స్థావరంపైకి ఇరాన్ మిసైల్స్!

ఇరాన్ తన దాడులను తీవ్రతరం చేసినట్టు తెలుస్తోంది. ఏకంగా 4 వేల కిలోమీటర్ల దూరంలోని యూఎస్, యూకేల సంయుక్త సైనిక స్థావరమే లక్ష్యంగా రెండు బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించినట్టు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. హిందూ మహాసముద్రంలోని డియేగో గార్సియా దీవిలోగల సైనిక స్థావరంపై మిసైల్స్‌ను ప్రయోగించిందని సమాచారం.

వార్త 2లో

## ఘనంగా రంజాన్ వేడుకలు

**హైదరాబాద్:**

రంజాన్ పర్వదినం పురస్కరించుకొని తెలంగాణ వ్యాప్తంగా ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా రామగుండం, పెద్దపల్లి, మంథని నియోజకవర్గాల్లోని దర్గాలలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రంజాన్ పర్వదినం విశిష్టతను వివరిస్తూ మత పెద్దలు హితబోధ చేశారు. అదేవిధంగా పేద ముస్లిం కుటుంబాలకు దానధర్మాలు నిర్వహించారు. పండుగ సందర్భంగా ఇలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. రామగుండంలో ఈద్గాల వద్ద జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్, మేయర్ మహంకాళి స్వామి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మైనార్టీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. అదేవిధంగా బడ్జెట్లో సైతం పెద్ద ఎత్తున మైనార్టీ సంక్షేమానికి ఖర్చు చేస్తున్నామని పేర్కొన్నారు. రంజాన్ పర్వదినం సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పెద్దపల్లి డిసిపి రామ్ రెడ్డి తెలిపారు.



## ఇరాన్ ను తీవ్రంగా దెబ్బతీస్తున్నాం: ట్రంప్



**వాషింగ్టన్:**

ఇరాన్ నౌకాదళం, వైమానిక దళాన్ని నాశనం చేశామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. సైనిక పరంగా ఇరాన్ పని అయిపోయిందని అన్నారు. ఈ సందర్భంగా ట్రంప్ మీడియాతో మాట్లాడుతూ.. ఖర్గ్ ద్వీపానికి సంబంధించి తమ వద్ద ఉన్న ప్రణాళికలు చెప్పలేనని, ఇరాన్ ను తీవ్రంగా దెబ్బతీస్తున్నామని తెలియజేశారు. హోర్ముజ్ జలసంధి గురించి తమకు అవసరం లేదని, యూరప్, జపాన్, చైనా, కొరియాకు అవసరం కాబట్టి వారు జోక్యం చేసుకోవాలని సూచించారు. హోర్ముజ్ జలసంధి తెరిపించేందుకు పెద్ద సంఖ్యలో నౌకలు అవసరమని, హోర్ముజ్ ను తెరిపించేందుకు నాటో సాయం చేయగలదు.. కానీ వారికి ధైర్యం లేదని ట్రంప్ విమర్శించారు.



2 లో..

## సోషల్ మీడియా పరిచయాలు అమ్మాయిలను ప్రమాదాల్లోకి నెట్టివేస్తున్నాయి: సజ్జనార్

స్మార్ట్‌ఫోన్ ఇప్పుడు ఎంతోమంది ఆడపిల్లల పాలిట శాపంగా మారుతోందని హైదరాబాద్ నగర సీపీ సజ్జనార్ ఆందోళన వ్యక్తం చేశారు. సోషల్ మీడియా వినియోగం పెరిగిన తర్వాత అపరిచితులతో ఏర్పడుతున్నపరిచయాలు యువతులను ఊహించని ప్రమాదాల్లోకి నెట్టివేస్తున్నాయని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా హెచ్చరించారు. "ఇటీవల కాలంలో ఈ తరహా విషాదకర ఘటనలు నా దృష్టికి ఎక్కువగా వస్తున్నాయి. ఆ కథనాలు చూశాక ఎంతో బాధనిపిస్తోంది

# జీవన్ రెడ్డికి పార్టీ అండ

**ఎలాంటి నిర్ణయం తీసుకోవద్దని కోరాం**

**చర్చించిన అంశాలను పార్టీ, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తాం**

**జగిత్యాల ప్రాంతానికి జీవన్ రెడ్డి పెద్దదిక్కు**

**ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల గొంతుకగా ఉన్న నాయకుడు జీవన్ రెడ్డి**

**జీవన్ రెడ్డితో ముగిసిన మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్‌ల భేటీ**

జగిత్యాల, న్యూస్‌వార్ ప్రతినిధి



కాంగ్రెస్ నేత జీవన్ రెడ్డితో మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్‌ల భేటీ ముగిసింది. పార్టీ పెద్దల తీరుపై గత కొంతకాలంగా తీవ్ర అసంతృప్తితో ఉన్న జీవన్ రెడ్డి.. కాంగ్రెస్‌కు గుడ్ బై చెప్పి.. బీఆర్ఎస్ పార్టీలో చేరుతారనే ప్రచారం జరుగుతోంది. ఈనేపథ్యంలో జీవన్ రెడ్డిని కలిసిన మంత్రులు.. ఆయనను బుజ్జగించే ప్రయత్నం చేశారు. చాలా సమయం జీవన్ రెడ్డితో చర్చలు జరిపిన మంత్రులు.. పార్టీలో ఆయనకు సముచిత ప్రాధాన్యం దక్కేలా అధిష్ఠానం చూసుకుంటుందని హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. అయితే, వీరి బుజ్జగింపులు సఫలీకృతం అయినట్లుగా కనిపించడం లేదు. జీవన్ రెడ్డితో భేటీ అనంతరం మంత్రి శ్రీధర్ బాబు మీడియాతో మాట్లాడారు. పార్టీ మారే విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోవద్దని జీవన్ రెడ్డిని కోరామని మంత్రి తెలిపారు. జీవన్ రెడ్డికి పార్టీ అండగా నిలబడే ఆలోచన చేస్తుందన్నారు. ఆయనతో చర్చించిన అంశాలను పార్టీ, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు. జగిత్యాల ప్రాంతానికి జీవన్ రెడ్డి పెద్దదిక్కు అని.. అభివృద్ధి కోసమే 10 మంది ఎమ్మెల్యేలను తీసుకున్నామని మంత్రి శ్రీధర్ బాబు చెప్పారు. జీవన్ రెడ్డి గురించి తెలంగాణ రాష్ట్రంలో తెలియని వారు ఎవరూ ఉండరన్నారు. ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల గొంతుకగా ఉన్న నాయకుడు జీవన్ రెడ్డి అని అన్నారు. జీవన్ రెడ్డి బాధపడితే తాము బాధపడినట్లేనని అన్నారు. కాంగ్రెస్ నాయకులు మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షులు మహేష్ గౌడ్, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలు జీవన్ రెడ్డితో గతంలో మాట్లాడారని మంత్రి తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను జీవన్ రెడ్డి తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. ఈ వివరాలను పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తామని మంత్రి చెప్పారు.

### జీవన్ రెడ్డి ఆగ్రహం..

తన పట్ల పార్టీ పెద్దలు అనుసరిస్తున్న వైఖరిపై మంత్రుల వద్ద జీవన్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఇన్ని అవమానాలు ఎదుర్కొంటూ పార్టీలో ఇంకా ఎందుకు కొనసాగాలని మంత్రులను ప్రశ్నించారు జీవన్ రెడ్డి. పార్టీలో గౌరవం లేనప్పుడు ఎందుకు ఉండాలని నిలదీశారు. దీంతో మీ సమస్యకు పరిష్కారం ఏంటని జీవన్ రెడ్డిని ప్రశ్నించారు మంత్రులు. స్పందించిన జీవన్ రెడ్డి.. పార్టీ ఫిరాయించిన 10 మంది ఎమ్మెల్యేలను పక్కన పెట్టడమే తన సమస్యకు పరిష్కారమని మంత్రులకు తేల్చి చెప్పారు. ఇన్ని అవమానాలు భరిస్తూ పార్టీలో ఎందుకు ఉండాలని అడుగుతున్న తన కుమారులకు ఏం సమాధానం చెప్పాలని మంత్రులను అడిగిన జీవన్ రెడ్డి.. సారీ చెప్పి సమావేశాన్ని ముగించేశారు.

## మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డికి షాక్..

హైదరాబాద్, న్యూస్‌వార్ ప్రతినిధి

బీఆర్ఎస్ నేత, తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డికి చెందిన ఫామ్‌హౌస్‌పై జరిగిన పోలీసుల దాడి, తదనంతర పరిణామాలు ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో పెను సంచలనం సృష్టిస్తున్నాయి.

### పైలట్ రోహిత్ రెడ్డి ఫామ్‌హౌస్ సీజ్: అసలేం జరిగిందంటే..?

మొయినాబాద్‌లోని అజీజ్‌నగర్ పరిధిలో ఉన్న రోహిత్ రెడ్డి ఫామ్‌హౌస్‌పై పోలీసులు ఆకస్మిక దాడి నిర్వహించారు. ఈ ఫామ్‌హౌస్ డ్రగ్స్ కార్యాకలాపాలకు నిలయంగా మారిందనే పక్కా సమాచారంతో పోలీసులు ఈ చర్యలు చేపట్టారు. మొయినాబాద్ పోలీసులు ఫామ్‌హౌస్‌ను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. డ్రగ్స్ పార్టీ నిర్వహించిన సమయంలో ఫామ్‌హౌస్‌లో జరిగిన పార్టీకి హాజరైన వారి విలాసవంతమైన వాహనాలను కూడా పోలీసులు సీజ్ చేశారు. ఈ ఫామ్‌హౌస్‌ను అసైన్డ్ భూమిలో నిర్మించినట్లు రెవెన్యూ అధికారులు ప్రాథమికంగా గుర్తించారు.

### భూ వివాదం – రెవెన్యూ అధికారుల నివేదిక

రోహిత్ రెడ్డి ఫామ్‌హౌస్ నిర్మాణం చుట్టూ అనేక చట్టపరమైన చిక్కులు ఉన్నాయి. అజీజ్‌నగర్‌లోని సర్వే నంబర్ 177/33లో సుమారు 2.20 ఎకరాల విస్తీర్ణంలో ఈ ఫామ్‌హౌస్ నిర్మించారు. ఈ భూమిని 2006లో రోహిత్‌రెడ్డి తండ్రి విఠల్ రెడ్డి పేరుతో రిజిస్ట్రేషన్ అయినట్లు రికార్డుల్లో ఉంది. అయితే, ప్రభుత్వ 'భూభారతి' రికార్డుల్లో ఈ భూమి జంగయ్య అనే వ్యక్తి పేరు మీద ఉన్నట్లు గుర్తించారు.

### రిజిస్ట్రేషన్ అక్రమాలు..

నిబంధనల ప్రకారం అసైన్డ్ భూమిని విక్రయించడం లేదా రిజిస్ట్రేషన్ చేయడం చట్టవిరుద్ధం. అసైన్డ్ భూమిపై రిజిస్ట్రేషన్ ఎలా జరిగింది.? , దానికి సహకరించిన అధికారులు ఎవరు..? అనే కోణంలో పోలీసులు, రెవెన్యూ అధికారులు సమగ్ర విచారణ చేపట్టారు.

### పోలీసుల చర్యలు..

ఈ కేసులో పోలీసులు అత్యంత వేగంగా చర్యలు తీసుకున్నారు. రోహిత్ రెడ్డిని కస్టడీలోకి తీసుకున్న తర్వాత, నేరుగా ఫామ్‌హౌస్‌కు తీసుకెళ్లి సీన్ రీకన్‌స్ట్రక్షన్, విచారణ చేపట్టనున్నట్లు సమాచారం. నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న కార్యక్రమాలు, భూ అక్రమాలపై ఇప్పటికే రెవెన్యూ అధికారులకు పోలీసులు అధికారిక లేఖలు రాశారు.

### ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో రోహిత్ రెడ్డి కీలక పాత్ర..

గతంలో ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో రోహిత్ రెడ్డి కీలక పాత్ర పోషించారు. ఆయన ఇప్పుడు వరుసగా చట్టపరమైన ఇబ్బందుల్లో చిక్కుకోవడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. అక్రమ నిర్మాణాలు, అసైన్డ్ భూముల ఆక్రమణలపై ప్రస్తుత ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోండటంతో ఈ కేసు మరింత ప్రాధాన్యం సంతరించుకుంది.

## ఏ ముఖం పెట్టుకుని సిద్దిపేటకు వస్తున్నావ్ రేవంత్: హరీశ్ రావు

సిద్దిపేట: న్యూస్‌వార్ ప్రతినిధి

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు బహిరంగ లేఖ రాశారు. సీఎం రేవంత్ రేపు(ఆదివారం) సిద్దిపేట పర్యటన నేపథ్యంలో పలు ప్రశ్నలు సంధిస్తూ లేఖ విడుదల చేశారు. రేపు సిద్దిపేట నియోజకవర్గానికి చేసిన ద్రోహం, నిధుల రద్దుపై ముఖ్యమంత్రి వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు హరీశ్ రావు. రేవంత్ ప్రారంభించబోయే అభివృద్ధి పనుల్లో ఏ ఒక్కటీ కాంగ్రెస్ ఇచ్చిందని లేదని.. అవన్నీ బీఆర్ఎస్ హయాంలో నిర్మించుకున్నవే అని తెలిపారు. శ్రమ ఫలితం మాది, శిలాఫలకాలు మీవా? అంటూ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కాగా, రేపు సిద్దిపేట జిల్లా నర్మెట్టలో 365 ఎకరాల విస్తీర్ణంలో రూ.300 కోట్లతో నిర్మించిన ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హరీశ్ రావు మాట్లాడుతూ..'సీఎం రేవంత్ రెడ్డి రేపు ప్రారంభించే ఆయిల్ ఫ్యాక్టరీ 2021లోనే ప్రారంభించాం. ఈ ఆయిల్ ఫామ్‌కి ప్రాణాధారం కాళేశ్వరం ప్రాజెక్టు. కాళేశ్వరాన్ని కూలేశ్వరం అన్న రేవంత్ రెడ్డి తన వైఖరి మార్చుకోవాలి. కాళేశ్వరాన్ని అడ్డుకోవడానికి ఆయన అనేక ప్రయత్నాలు చేశారు. మొక్కవోని దీక్షతో పూర్తి చేసింది మేము. ఇప్పటికైనా కాళేశ్వరంపై చిల్లర మాటలు మానుకో. ఆ ప్రాజెక్టు పూర్తి చేయడంలో అనేక విధాలుగా శ్రమ పడ్డాం. 20 కోట్ల లీటర్ల నీటి నిలువ సామర్థ్యం కలిగిన పాండ్ నిర్మించాం. మలేషియా టెక్నాలజీతో ఇండియాలోనే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించాం. బీఆర్ఎస్ కృషి ఫలితమే ఆయిల్ ఫ్యాక్టరీ. దాన్ని ఈరోజు రేవంత్ రెడ్డి ప్రారంభిస్తున్నారు. సెంట్రల్ డ్రగ్ స్టోర్, జిల్లా జైలు, ఆయుష్ ఆస్పత్రి, రెండు పీహెచ్సీలు నేను ఆరోగ్య శాఖ మంత్రిగా ఉండగా మంజూరు చేసి పూర్తి చేసినవి. వీటికి మీరు శిలాఫలకం వేసుకుని ప్రారంభిస్తున్నారు. ఇందులో మీరు చేసిందేమీ లేదు. మేము ఆలయాలు, విద్యాలయాలు, రిజర్వాయర్లు, జైళ్లు నిర్మించాం. రూ.78కోట్లతో 30 ఎకరాల్లో జిల్లా జైలు నిర్మించాం. కట్టించింది మేము, శిలాఫలకం మీరు వేసుకున్నారు. చేసుకో నాకేమీ ఈర్ష్య లేదు. కానీ శ్రమ ఎవరిది, శిలాఫలకం ఎవరిది?. కనపడిన ప్రతి దేవుడు మీద ఒట్టుపెట్టి రుణమాఫీ అన్నారు.. అది ఇప్పటికీ కాలేదు. సిద్దిపేట జిల్లాలో 22వేల మంది రైతులకు రూ.300కోట్ల రుణమాఫీ పెండింగ్‌లో ఉంది. ఒక నర్మెట్టలోనే 350మంది రైతులకు రుణమాఫీ కాలేదు. మా నియోజకవర్గంలో రుణమాఫీ అయ్యింది 48 శాతం, కానిది 52 శాతం. మూడు పంటలకు రైతు బంధు ఎగ్గొట్టారు. రేపు ఏ రైతు బంధు ఇస్తున్నారో రేవంత్ తెలపాలి.

## మొయినాబాద్ డ్రగ్స్ కేసు.. సిట్ బృందానికి చిక్కిన డ్రగ్ పెడ్లర్..

రంగారెడ్డి జిల్లా: తెలుగు రాష్ట్రాల్లో మొయినాబాద్ డ్రగ్స్ కేసు సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. సిట్ దర్యాప్తు చేపట్టిన ఈ కేసు తాజాగా కీలక మలుపు తిరిగింది. డ్రగ్ పెడ్లర్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అభిషేక్ సింగ్‌ను సిట్ బృందం (ా×ు ుజూావీ) అదుపులోకి తీసుకుంది. నిందితుల్లో ఒక్కరైన కౌశిక్ రవి ఇచ్చిన సమాచారంతో నాలుగు బృందాలుగా ఏర్పడిన సిట్ ఎట్టకేలకు అతణ్ని పట్టుకుంది. హైదరాబాద్‌లోనే అభిషేక్ సింగ్‌ను అదుపులోకి తీసుకోవడం గమనార్హం. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి ఫామ్ హౌస్ పార్టీకి అభిషేక్ సింగ్( డ్రగ్స్ సప్లై చేశాడు. హైదరాబాద్ వద్ద అభిషేక్ సింగ్ నుంచి రోహిత్ డ్రైవర్ శరత్ డ్రగ్స్ కొనుగోలు చేశాడు. అనంతరం పార్టీలో నమిత్ శర్మ, రోహిత్ రెడ్డి, రితేశ్‌రెడ్డి, పుట్టా మహేశ్ కుమార్, అర్జున్ రెడ్డి, కౌశిక్ రవి డ్రగ్స్ వినియోగించారు. నమిత్ శర్మ మూడు రకాల డ్రగ్స్ తీసుకున్నట్లు రక్త పరీక్షల్లో బయటపడగా.. పైలట్ రోహిత్ రెడ్డి, రితేశ్ రెడ్డి, అర్జున్ రెడ్డి మద్యంలో కొకైన్ కలుపుకుని తాగినట్లు వైద్య పరీక్షల్లో తేలింది. తాజాగా, అభిషేక్ సింగ్ పోలీసులకు చిక్కడంతో మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అభిషేక్ సింగ్ నుంచి ఇంకా ఎవరెవరూ డ్రగ్స్ కొనుగోలు చేశారు? అనే విషయంపైనా కూపీ లాగుతున్నారు సిట్ అధికారులు. మరోవైపు అతని ఫోన్‌లో కీలక డేటా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు అభిషేక్ సింగ్ సెల్ ఫోన్ డేటాను విశ్లేస్తున్నారు సిట్ అధికారులు.

## గుడ్‌న్యూస్.. భారీగా తగ్గిన బంగారం ధరలు..

ఇంటర్‌నెట్ డెస్క్: న్యూస్‌వార్ ప్రతినిధి

అంతర్జాతీయ మార్కెట్‌లో నెలకొన్న పరిస్థితుల కారణంగా భారత దేశంలో బంగారం ధరలు రోజురోజుకు భారీగా తగ్గుతున్నాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం.. నిన్న (మార్చ్ 20) హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ.1,48,910 రూపాయలు.. 22 క్యారెట్ 10 గ్రాముల పసిడి ధర రూ.1,36,550 రూపాయలు ఉండింది. ఈ రోజు బంగారం ధరలు భారీగా తగ్గాయి. 10 గ్రాముల 24 క్యారెట్ బంగారంపై 2,940 రూపాయలు.. 22 క్యారెట్ బంగారంపై 2,750 రూపాయలు తగ్గింది. ప్రస్తుతం 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ.1,45,970 రూపాయల దగ్గర.. 22 క్యారెట్ 10 గ్రాముల పసిడి ధర రూ.1,33,800 రూపాయల దగ్గర ట్రేడ్ అవుతోంది.

### వెండి ధరలు పతనం

బంగారం మాదిరిగానే వెండి ధరలు కూడా భారీగా పతనం అయ్యాయి. నిన్న కిలో వెండి 2,60,000 రూపాయల దగ్గర.. 100 గ్రాముల వెండి 26,000 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. ఈ రోజు కిలోపై 10 వేల రూపాయలు.. 100 గ్రాములపై వెయ్యి రూపాయలు తగ్గింది. ప్రస్తుతం కిలో వెండి 2,50,000 రూపాయల దగ్గర, 100 గ్రాముల వెండి 25 వేల రూపాయల దగ్గర ట్రేడ్ అవుతోంది.

## 4 వేల కిలోమీటర్ల దూరంలోని యూఎస్ స్థావరంపైకి ఇరాన్ మిసైల్స్!

ఇంటర్నెట్ డెస్క్:

ఇరాన్ తన దాడులను తీవ్రతరం చేసినట్టు తెలుస్తోంది. ఏకంగా 4 వేల కిలోమీటర్ల దూరంలోని యూఎస్, యూకేల సంయుక్త సైనిక స్థావరమే లక్ష్యంగా రెండు బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించినట్టు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. హిందూ మహాసముద్రంలోని డియేగో గార్సియా దీవిలోగల సైనిక స్థావరంపై ఇరాన్ ఈ మిసైల్స్‌ను ప్రయోగించిందని సమాచారం. చాగోస్ ద్వీపసముదాయంలో ఇదొక భాగం. మీడియా కథనాల ప్రకారం, ఇరాన్ ప్రయోగించిన తొలి మిసైల్ మార్గమధ్యంలోనే విఫలమైంది. మరో మిసైల్‌పై ఒక అమెరికా యుద్ధ నౌక క్షిపణి విధ్వంసక రాకెట్‌ను ప్రయోగించింది. ఈ దాడిలో రెండో మిసైల్ ధ్వంసమైందా? లేదా? అనేది ఇంకా తెలియాల్సి ఉంది. ఈ వార్తలపై అమెరికా ఇంకా స్పందించలేదు. ఇప్పటివరకూ ఇరాన్ మిసైల్ దాడులు పశ్చిమాసియాకే పరిమితమయ్యాయి. తాజాగా హిందూ మహాసముద్రంలోని దీవిని ఇరాన్ టార్గెట్ చేసిందన్న వార్తలు కలకలం రేపుతున్నాయి. ఇదే నిజమైతే ఐరోపా ఖండంలోని పలు యూఎస్ సైనిక స్థావరాలు ఇరాన్ దాడుల పరిధిలోకి వచ్చినట్టు అవుతుందని విశ్లేషకులు కామెంట్ చేస్తున్నారు. ఇటీవల శ్రీలంకకు దక్షిణాన హిందూ మహాసముద్ర జలాల్లో ఒక ఇరాన్ యుద్ధ నౌకను అమెరికా సబ్‌మెరైన్ ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. టార్పిడో ప్రయోగంతో తీవ్రంగా దెబ్బతిన్న ఇరాన్ నౌక నీట మునిగిపోయింది. ఈ ఘటనలో సుమారు 85 మంది మరణించారు. భారత్‌లో జరిగిన మిలన్–2026 నావికాదళ విన్యాసాల్లో పాల్గొన్న ఇరాన్ నౌక తిరిగి వెళుతున్న సమయంలో అమెరికా దాడి చేసింది. ఇరాన్ నావికా దళాన్ని నిర్వీర్యం చేయడం తమ ప్రాథమిక లక్ష్యాల్లో ఒకటని అమెరికా అప్పట్లో పేర్కొంది.



## సోషల్ మీడియా పరిచయాలు అమ్మాయిలను ప్రమాదాల్లోకి నెట్టివేస్తున్నాయి: సజ్జనార్

ఇంటర్‌నెట్ డెస్క్: న్యూస్‌వార్ ప్రతినిధి

స్మార్ట్‌ఫోన్ ఇప్పుడు ఎంతోమంది ఆడపిల్లల పాలిట శాపంగా మారుతోందని హైదరాబాద్ నగర సీపీ సజ్జనార్ ఆందోళన వ్యక్తం చేశారు. సోషల్ మీడియా వినియోగం పెరిగిన తర్వాత అపరిచితులతో ఏర్పడుతున్నపరిచయాలు యువతులను ఊహించని ప్రమాదాల్లోకి నెట్టివేస్తున్నాయని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా హెచ్చరించారు."ఇటీవల కాలంలో ఈ తరహా విషాదకర ఘటనలు నా దృష్టికి ఎక్కువగా వస్తున్నాయి. ఆ కథనాలు చూశాక ఎంతో బాధనిపిస్తోంది. సైబర్ నేరగాళ్లు అందమైన యువకులు లేదా సినీ నటుల ఫోటోలను డీపీలుగా పెట్టుకుని నకిలీ ఖాతాలతో అమ్మాయిలకు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ లాంటి వాటిలో ఫ్రెండ్ రిక్వెస్టులు పంపుతున్నారు. ఆ మాయమాటలకు ఆకర్షితులై కొందరు ఆడపిల్లలు వారిని గుడ్డిగా నమ్మి తమ వ్యక్తిగత ఫోటోలను, వీడియోలను పంచుకుంటున్నారు" అని తెలిపారు. ఆ ఫోటోలను వారితో పంచుకోగానే ఆ అపరిచితులు రాక్షసులుగా మారిపోయి వాటిని అడ్డంపెట్టుకుని బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్నారని తెలిపారు. వాటిని మార్ఫింగ్ చేసి డబ్బులు కావాలని, భౌతికంగా కలవాలని వేధింపులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. పరువు పోతుందన్న భయంతో, ఈ విషయాన్ని ఇంట్లో చెప్పలేక కొందరు అమ్మాయిలు అడిగినంత డబ్బులు ముట్టజెబుతూ తీవ్ర మానసిక క్షోభను అనుభవిస్తున్నారని, ఈ వేధింపులు తాళలేక కొందరు తమ ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆడపిల్లలకు విజ్ఞప్తి ఒక్కటేనని, మీకు ఆన్‌లైన్‌లో ఇలాంటి సమస్య లేదా అన్యాయం ఎదురైతే అస్సలు భయపడవద్దని, ఆ సైబర్ నేరగాళ్ల బ్లాక్ మెయిలింగ్‌కు లొంగవద్దని, ప్రాణాలు తీసుకోవద్దని సూచించారు. వెంటనే ఈ విషయాన్ని మీ తల్లిదండ్రులకు లేదా స్నేహితులకు చెప్పాలని అన్నారు. ఏమాత్రం సంకోచించకుండా డయల్ 100కు కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని, మీకు అండగా పోలీసులు ఎల్లప్పుడూ ఉంటారని హామీ ఇచ్చారు. తల్లిదండ్రులు కూడా పిల్లలతో కాస్త సమయం గడుపుతూ, వారు ఆన్‌లైన్‌లో ఏం చేస్తున్నారు, ఎవరితో మాట్లాడుతున్నారు అనేదానిపై గమనిస్తూ ఉండాలని సూచించారు. ఫేక్ ప్రొఫైల్స్, ఫేక్ నెంబర్లు, వీపీఎన్‌లు వాడితే పోలీసులకు పట్టుబడబోమని సైబర్ నేరగాళ్లు భ్రమల్లో ఉండవద్దని, మీరు ఎక్కడున్నా సరే పట్టుకొచ్చి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆడపిల్లలు సోషల్ మీడియాలో అప్రమత్తంగా ఉంటూ, అన్యాయం జరిగితే ధైర్యంగా ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.

## విజయ్ ఎన్నికల్లో పోటీ చేయడంపై ప్రశ్న... కమల్ హాసన్ ఏమన్నారంటే?

సినీ నటుడు విజయ్ పార్టీని స్థాపించడం, తమిళనాడులో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడంపై మీడియా అడిగిన ప్రశ్నకు ప్రముఖ నటుడు కమల్ హాసన్ స్పందించిన తీరుపై నెటిజన్లు విమర్శలు గుప్పిస్తున్నారు. తమిళనాడులో డీఎంకే పార్టీతో పొత్తు చర్చలు తదితర అంశాలపై ఆయన మీడియాతో మాట్లాడారు. ఇదే సమయంలో మీడియా ప్రతినిధులు విజయ్ పార్టీ గురించి ప్రశ్నించారు. పెరంబూర్ నుంచి విజయ్ పోటీ చేసే అవకాశముందని, దీని గురించి మీరు ఏం చెబుతారని మీడియా ప్రశ్నించింది. ఈ ప్రశ్నకు కమల్ హాసన్ నవ్వుతూ, "ఆ విషయాలు నాకెందుకు? నాకు చాలా పనులు ఉన్నాయి, వాటిపైనే దృష్టి పెట్టాలి" అని బదులిచ్చారు. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. సహనటుడు రాజకీయ పార్టీని ఏర్పాటు చేసినప్పుడు శుభాకాంక్షలు తెలియజేయడం కనీస మర్యాద అని, కానీ నిర్లక్ష్యంగా మాట్లాడటం సరికాదని నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కమల్ హాసన్ ఇంకా మాట్లాడుతూ, రజనీకాంత్, నెల్సన్ దిలీప్‌కుమార్‌లతో కలిసి తాను నటిస్తున్న చిత్రంపై స్పందించారు. తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఈ చిత్రం షూటింగ్ మొదలవుతుందని అన్నారు. తనకు రాజకీయంగా చాలా పనులు ఉన్నాయని, అలాగే సినిమాల్లో నటించాల్సి ఉందని వెల్లడించారు.

న్యూస్ వార్ వార్తా పత్రిక

సంపాదకీయం...

## వాటా పెంపునకు

# ఉద్యమ బాట

దేశంలో శతాబ్దాలుగా సామాజిక అణిచివేతకు గురైన దళితులు దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా రాజ్యాంగపరమైన రక్షణను పూర్తిస్థాయిలో పొందలేకపోతున్నారు. ఈ దేశ మూలవాసులైన దళితులకు అన్నిరంగాల్లోనూ తీరని అన్యాయం జరుగుతున్నదని దళిత సంఘాల నేతలు అభిప్రాయపడుతున్నారు. స్వాతంత్ర్యానంతరం మహనీయుడు అంబేద్కర్ కృషికి తోడు, ఆయన ఆలోచన విధానానికి కొనసాగింపుగా వివిధ దళిత సంఘాలు దళిత సమాజంలో కొంత చైతన్యాన్ని తీసుకురాగలిగినా, వివక్ష, అంటరానితనం, సామాజిక అసమానతలు నేటికీ సమాజంలో కొనసాగుతుండటం బాధాకరం.దళితులు అట్టడుగు సమూహంగా తమ వెనుకబాటుతనాన్ని జయించడం కోసం ఇంకా పోరాడుతూనే ఉన్నారు. దాడులు, మహిళలపై లైంగిక వేధింపులు దేశంలో ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నాయి. దేశంలో పంచమజాతి వారు అనే పేరుతో కుల ఆధారిత వివక్షను అనుభవిస్తూ, శారీరక హింసతోపాటు, సామాజిక వెలివేతకు గురై ఎన్నో దురాగతాలను కూడా ఎదుర్కొంటున్నారు.దళితులకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో తోడ్పాటును అందించడానికి రాజ్యాంగబద్ధంగా రిజర్వేషన్‌లను కల్పించారు.

ఉమ్మడిగా రిజర్వేషన్ అమలు విధానం వల్ల ఎస్సీల్లోని అత్యంత వెనుకబాటు తనానికి గురైన అత్యల్ప సంఖ్యాక ఉప కులాలు మాదిగల పోరాట విజయంతో ఉమ్మడి రిజర్వేషన్‌ల విధానానికి స్వస్తి పలికి ఎవరికి వారుగా అభివృద్ధి పథం వైపు (కులాల వారీగా జనాభా దామాషా ప్రకారం వచ్చిన రిజర్వేషన్ వాటాతో) పయనించడానికి వర్గీకరణ ఎంతో మేలు చేకూర్చుతుంది.రాజ్యాంగం అమల్లోకి వచ్చి సుమారు ఎనిమిది దశాబ్దాలు కావస్తున్నా అప్పటి జనాభాకు అనుగుణంగా దళితులకు రా జ్యాంగబద్ధంగా కల్పించిన 15% రిజర్వేషన్లు మాత్రమే ఇప్పటికే కొనసాగించడాన్ని ఎంతోమంది ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో పెరిగిన జనాభాకు అనుగుణంగా ఎస్సీల రిజర్వేషన్లను 20 శాతానికి పెంచాలని డిమాండ్ చేస్తూ, మరో మానవత్వ ఉద్యమానికి దళిత సంఘాలు సమాయత్తమవడం మనుగడ కోసం పోరాటంగానే చూడాలి. ఒక సమూహాన్ని అనేక తరాలుగా విద్యకు దూరంగా ఉంచడం అంటే సమాజంలో మనుషులుగా బతికే హక్కును దూరం చేయడమే. ఇలాంటి వ్యవస్థలో దళితుల దయనీయ స్థితిని, వెనుకబాటుతనాన్ని అధిగమించడానికి దళితులు చదువు వైపు పయనిస్తూ, రిజర్వేషన్‌లను ఆసరాగా చేసుకొని తమను తాము మనుషులుగా సంస్కరించుకునే పనిలో పడ్డారని గ్రహించాలి.ఈ తరుణంలో 'మేమెంతో మాకు అంత వాటా' అనే నినాదంతో దళిత సంఘాలు, మరీ ముఖ్యంగా చదువుకున్న దళిత యువత ఉద్యమబాట పట్టాలనుకోవడం పాలకులు 'అధికారం' అనే అద్దంలో నుంచి కాకుండా, 'మానవత్వం' అనే కోణంలో చూడాలి. నిశ్శబ్దంలో నుంచి నిప్పుకణికలు పుట్టేలా.. మలిదశ తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో దళిత యువత రిజర్వేషన్‌ల పెంపు కోసం మరో మానవత్వ యుద్ధానికి సిద్ధపడటం హర్షించదగ్గ పరిణామం.తెలంగాణ వ్యాప్తంగా సభలు, సమావేశలు, రథయాత్రలకు కూడా ప్రణాళికలకు రచిస్తూ, కార్య సాధనకు కదనరంగాన తమ జాతిని నిలుపడానికి పలు దళిత సంఘాలు ప్రయత్నాలు ప్రారంభించాయి. కులాలవారీగా జనాభాను సమాయత్తం చేయడానికి అంబేద్కర్ జయంతిని ఎంచుకోవడం, అది రాష్ట్రంలో మరో మానవత్వ ఉద్యమానికి నాంది పలికే రోజు కావడం అనివార్యంగా కనిపిస్తున్నది.ఉమ్మడి రిజర్వేషన్ల పెంపు కోసం ఐక్య ఉద్యమాలకు సిద్ధపడటమా? లేదా ఎవరి వేదికల ద్వారా వాళ్లు ముందుకు వెళ్లడమా? అనే విషయంపై నిర్దిష్ట నిర్ణయానికి వచ్చిన తర్వాత ఉద్యమ కార్యాచరణను ప్రకటించాలని దళిత సంఘాల ప్రతినిధులు ఆలోచన చేస్తున్నట్టుగా తెలుస్తున్నది.రాజ్యాంగంలోని కొన్ని నిబంధనల ఆధారంగా వివక్ష, కులవృత్తుల నేపథ్యంలో సామాజిక వెనుకబాటుకు గురైన కులాలు లేదా సమూహాలకు రిజర్వేషన్ కల్పించారు.రిజర్వేషన్‌లు స్వాతంత్ర్యం రాక ముందే కుల వ్యవస్థలో అంటరాని బతుకుల వల్ల ఏర్పడ్డ తమ వెనుకబాటును పోగొట్టుకోవడం కోసం వివిధ వర్గాల నుంచి డిమాండ్లు రావడంతో 1881-1891 మధ్య కాలంలో కొల్హాపూర్ సంస్థానంలో అప్పటి పాలక రాజు ఛత్రపతి సాహూజీ మహారాజ్ దేశంలో మొదటిసారి రిజర్వేషన్‌ల ప్రక్రియ మొదలుపెట్టి 1902లో అమల్లోకి తీసుకువచ్చారు. అంతే తప్ప ఈ రిజర్వేషన్లు ఇప్పటికిప్పుడు ప్రత్యేకంగా ఎవరో కల్పిస్తున్న ప్రత్యేక వసతులు ఏమీ కావు.తమిళనాడులో మొత్తం 69 శాతం రిజర్వేషన్ అమలులో ఉండగా, అందులో దళితులకు 18 శాతం రిజర్వేషన్ అమలు చేస్తున్నారు. దీనిని 1994 నాటి 76వ రాజ్యాంగ సవరణ ద్వారా అమల్లోకి తెచ్చారు. కర్నాటకలో మొత్తం 56 శాతం రిజర్వేషన్ అమలవుతుండగా, ఎస్సీలకు 17 శాతం రిజర్వేషన్ అందజేస్తున్నారు.పంజాబ్‌లో ఎస్సీలకు 25 శాతం వాటా దక్కుతున్నది. తెలంగాణలో కూడా పెరిగిన జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు పెంచాల్సిన ఇదే డిమాండ్ తో దళిత సంఘాలు ఉద్యమ బాట పడుతున్నాయి. పాలకులు ఇతర రాష్ట్రాల్లో రిజర్వేషన్‌ల అమలును పరిశీలించి, మానవీయ కోణంలో ఎస్సీ రిజర్వేషన్‌ల పెంపు ఆవశ్యకతను గుర్తించాలి. అంబేద్కర్ అందించిన గుర్తింపు, సమానహక్కు పేదలకు దక్కాలంటే ప్రభుత్వాలు ప్రజల పక్షాన మానవత్వంతో పనిచేసినప్పుడే దేశంలలో మనుగడ కోసం ప్రజలు రోడ్డెక్కే పరిస్థితి ఉండదు.



# శ్రీవారిని దర్శించుకున్న చంద్రబాబు కుటుంబం

### ఘనంగా స్వాగతించి, వేదాశీర్వచనం చేసిన పండితులు


### వెంగమాంబ అన్నసత్రంలో భక్తులకు ఆహారం వడ్డింపు

### ఏఐ ద్వారా దర్శనం సులువు చేసే చర్యలు

### భక్తులను నేరుగా కలుసుకుని చర్చించి చంద్రబాబు







**తిరుమల**

సీఎం చంద్రబాబు కుటుంబం తిరుమల శ్రీవారిని దర్శించుకుంది. మనవడు దేవాన్ష్ పుట్టిన రోజు సందర్భంగా శ్రీవారి సేవలో చంద్రబాబు కుటుంబం పాల్గొంది. ఆలయ మహాద్వారం వద్ద వారికి ఈవో, అర్చకులు ఇస్తికఫాల్ స్వాగతం పలికారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో అర్చకులు వేదాశీర్వచనాలు ఇచ్చి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో భక్తులకు చంద్రబాబు కుటుంబం స్వయంగా వడ్డించింది. దేవాన్ష్ పేరుతో ఒక్క రోజు అన్నదాన వితరణకు రూ.44 లక్షల విరాళం అందించారు. వెంగమాంబ సత్రం నుంచి పద్మావతి వసతిగృహానికి వెళ్తూ సీఎం మధ్యలో ఆగారు. లేపాక్షి కూడలిలో భక్తులతో మాట్లాడారు. ఓ చిన్నారిని ఎత్తుకుని ముద్దాడారు. భక్తుల సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. అనంతరం తిరుమలలో కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడారు. తితిదే ఆలయాలను అత్యంత ఆధునాతన ఆధ్యాత్మిక కేంద్రాలుగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. తిరుమలలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా.. ముందస్తుగా గుర్తించి వెంటనే పరిష్కారం చూపే విధంగా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని సూచించారు. భక్తులు క్యూలైన్లలోకి ప్రవేశించిన సమయం నుంచి.. శ్రీవారి దర్శనం పూర్తి చేసి తిరుగు ప్రయాణం అయ్యే వరకు.. వారికి అందుతున్న సౌకర్యాలను కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పర్యవేక్షించాలన్నారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తిరుమలలో సామాన్య భక్తుడిలా మారిపోయారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆయన తన కాన్వాయ్‌ను పక్కన పెట్టి, తిరుమల వీధుల్లో కాలినడకన తిరుగుతూ భక్తులతో ముఖాముఖి మాట్లాడారు. భక్తుల కష్టసుఖాలను, టీటీడీ అందిస్తున్న సేవలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు.

తిరుమల ప్రసాదం విశిష్టతను కాపాడటమే తమ ప్రభుత్వ ప్రాధాన్యతని భక్తులతో అన్నారు. గతంతో పోలిస్తే లడ్డూ నాణ్యత, రుచి చాలా బాగుందని భక్తులు ముఖ్యమంత్రికి వివరించారు. దర్శనం కోసం వేచి ఉండే సమయాన్ని మరింత తగ్గించేలా చర్యలు తీసుకోవాలని పలువురు భక్తులు ఈ సందర్భంగా సీఎంను కోరారు. భక్తుల విజ్ఞప్తిపై స్పందించిన చంద్రబాబు, శ్రీవారి దర్శనాన్ని మరింత సులభతరం చేసేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతను వినియోగించబోతున్నామని వెల్లడించారు. టెక్నాలజీ సాయంతో క్యూ లైన్ల నిర్వహణను క్రమబద్ధీకరించి, భక్తులకు తక్కువ సమయంలోనే స్వామివారి దర్శనం కలిగేలా టీటీడీ చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. మరోవైపు.. తిరుమల పర్యటనను ముగించుకొని రోడ్డు మార్గాన మంత్రి లోకేష్, భువనేశ్వరి, దేవాన్ష్ రేణిగుంట విమానాశ్రయానికి బయలుదేరారు.








## తిరుమలలో ఆహార పరీక్షా కేంద్రం

### ఫుడ్ ల్యాబ్‌ను ప్రారంభించిన చంద్రబాబు



తిరుమల,

తిరుమలలోని పిండి మర ప్రాంతంలో నూతనంగా నిర్మించిన 'వాటర్ అండ్ ఫుడ్ అనాలసిస్ ల్యాబ్' ను సీఎం చంద్రబాబు ప్రారంభించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో టీటీడీ ఈ ల్యాబ్‌ను అత్యంత ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసింది. సుమారు రూ.25 కోట్ల ఖర్చుతో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా దీనిని తీర్చిదిద్దారు. సుమారు 12 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో, రెండు అంతస్తుల్లో ఈ ల్యాబ్‌ను నిర్మించారు. ల్యాబ్‌లో సుమారు 50 రకాల అత్యాధునిక యంత్రాలను అమర్చారు, ఇవి ఆహార పదార్థాల్లోని అతి సూక్ష్మమైన లోపాలు కూడా గుర్తించగలవు. భక్తులకు అందించే అన్నప్రసాదాలు , లడ్డూ ప్రసాదాల విషయంలో ఎక్కడా రాజీ పడకుండా నిబంధనల ప్రకారం పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, టీటీడీ చైర్మన్, ఈవోతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. భక్తుల భద్రత, సౌకర్యాల పర్యవేక్షణ కోసం తిరుమలలో ఏర్పాటు చేసిన 'ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్' ప్రాధాన్యతను సీఎం వివరించారు. పారిశుద్ధ్యం నుంచి భద్రత వరకు ప్రతి అంశాన్ని ఈ వ్యవస్థ ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తామని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడటమే తమ లక్ష్యం అని స్పష్టం చేశారు.



న్యూస్ వార్
వార్తా పత్రిక

# విద్యారంగానికి మొండి చేయి... కొప్పుల.రవీందర్,

భద్రాచలం. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రెండు వేల ఇరవై ఆరు మరియు రెండు వేల ఇరవై ఏడు సంవత్సరం గాను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో విద్యారంగంపై చేసిన ప్రకటనలు వాస్తవ పరిస్థితులకు విరుద్ధంగా ఉన్నాయని కొప్పుల రవీంద్ర అన్నారు. స్థానిక భద్రాచల పట్టణంలోని నిర్వహించిన కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ సెక్రెటరీకొప్పులరవీంద్రమాట్లాడుతూ. ఒక్కో మండలానికి ఇంటర్నేషనల్ పాఠశాల ప్రకటిస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా కమిషన్ సిఫార్సుతగినట్లుబడ్జెట్ కేటాయింపులు లేవు ఐదు వేల కోట్లు కేటాయింపుచేసిచేతులుదులుపుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్ ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్స్ బకాయిలపై ప్రభుత్వం నాలుగు వేల మూడు వందల నలభై మూడు కోట్లు కేటాయింపు చేస్తామని చెప్పారు కానీ గత బకాయిలు భారీగా పేరుకుపోయిన వాటి గురించి ప్రస్తావన లేదు. ఈ సంవత్సరం ఫీజులు మళ్లీ అదనంగా ఉంటాయని సుమారు తొమ్మిది వేల ఐదు వందల కోట్లకుపైగాబకాయిలుపేరుకుపోయిన వాటి చెల్లింపు పై స్పష్టమైన ప్రణాళిక లేకపోవడం విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడటమేనని ఎస్ఎఫ్ఐ విమర్శిస్తుంది.



ప్రభుత్వ పాఠశాలలో హాస్టల్లో కనీసం మౌలిక వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కానీ బడ్జెట్లో వంద కోట్లు రినోవేషన్ కోసం కేటాయింపు చేశారు ఈ వందకోట్లతో హాస్టల్స్ ఎలా బాగుపడతాయని ప్రశ్నిస్తుంది ఎస్ఎఫ్ఐ.గురుకుల అద్దె భవనాలు కేజీబీవీ అదనపు బిల్డింగ్స్ సంక్షేమ వసతి గృహాల మౌలిక సదుపాయాలు ఈ అంశాలపై సరైన ప్రస్తావన లేకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమని ఎస్ఎఫ్ఐ విమర్శించింది వర్షం వస్తే కురిసే హాస్టల్స్ గదులు తగిన ఆహారం లేక ఇబ్బందులు పడుతున్న విద్యార్థుల పరిస్థితి గురించి ప్రభుత్వం ఒక్క మాట కూడా మాట్లాడలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.మొత్తానికి బడ్జెట్ విద్య రంగంపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి లేకపోవడాన్ని స్పష్టంగా చూపిస్తుందని ఎస్ఎఫ్ఐ భద్రాచలం డివిజన్ సెక్రెటరీ కొప్పుల రవీందర్ అన్నారు. తక్షణమే బడ్జెట్ సవరించివిద్యారంగానికిరాష్ట్రబడ్జెట్లో కనీసం ముప్పై శాతం నిధులు కేటాయింపులు చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేస్తుంది పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్షిప్స్ బకాయిలు తక్షణ చెల్లింపులు చేయాలనిప్రభుత్వయూనివర్సిటీలకు తక్షణ నిధులు విడుదల చేసి ఖాళీగా ఉన్న టీచర్ మరియు అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ కార్యక్రమంలో కార్తీక్,తరుణ్, పృధ్వి ,సాయికుమార్, అన్వేష్,కీర్తన్, పాల్గొన్నారు.

# ఈద్గా వద్ద ప్రార్ధనలో పాల్గొని ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలియజేసిన మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్.

రంజాన్ పండుగ పర్వదినాన ఇల్లెందు మాజీ శాసనసభ్యురాలు భానోత్ హరిప్రియ నాయక్ బిఆర్ఎస్ పార్టీ కుటుంబంలో భాగమైన ముస్లిం సోదరుల స్వగృహాలకు వెళ్లి వారిని మర్యాదపూర్వకంగా కలిసిపండుగ శుభాకాంక్షలు తెలియజేసారు. అనంతరం ఇల్లందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్, ఉమ్మడి ఖమ్మం జిల్లా భారత రాష్ట్ర సమితి వ్యవస్థాపక సభ్యులు దిండిగాల రాజేందర్ ఇల్లందు పట్టణ పార్టీ శ్రేణులతో కలిసి ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పాల్గొనే సామూహిక ప్రార్ధన స్థలం ఈద్గా వద్దకి వెళ్లి ముస్లిం సోదరులను



ఆప్యాయంగా పలకరించి వారికి రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు .ఈ సందర్భంగా ఇల్లందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్ మాట్లాడుతూ లౌకిక తత్వాన్ని కాపాడుతూ, శాంతియుతంగా నెలరోజుల పాటు ఉపవాస దీక్షల నిర్వహించి శనివారం పవిత్ర రంజాన్ పండగ సందర్భంగా పండుగ నిర్వహించుకుంటున్న ఇల్లందు నియోజకవర్గ ముస్లిం సోదర సోదరీమణులందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. రంజాన్ పండుగ పర్వదినాన కుల మతాలకతీతంగా పేద ధనిక బేధం లేకుండా పార్టీలకతీతంగా ఈ యొక్క పర్వదినాన్ని జరుపుకోవడం అనేది సంతోషంగా ఉందని అన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్, ఉమ్మడి ఖమ్మం జిల్లా భారత రాష్ట్ర సమితి వ్యవస్థాపక సభ్యులు దిండిగాల రాజేందర్, భారత రాష్ట్ర సమితి పట్టణ శ్రేణులతో కలిసి భారత రాష్ట్ర సమితి ఇల్లందు పట్టణ అధ్యక్షుడు మహమ్మద్ అబ్దుల్ జబ్బార్, ఇల్లందు పట్టణ నాయకులు, ఎస్.కె చాంద్ పాషా, మీరజాబేగ్, పాషా, ఇల్లందు మండల మాజీ కో ఆప్షన్ సభ్యులు ఎస్కే గాజి, సిటీ కేబుల్ యూనిస్ ముస్లిం సోదరుల స్వగృహాలకు వెళ్లి వారిని వారి కుటుంబ సభ్యులను మర్యాదపూర్వకంగా కలిసి పాయసాన్ని సేవించి వారికి వారి కుటుంబ సభ్యులకు రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. పండుగ వేళ మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్ తమ స్వగృహాలకు వచ్చి శుభాకాంక్షలు తెలియజేయడం పట్ల పార్టీ నాయకులు సంతోషం వ్యక్తం చేశారు.

# 100 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించిన ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య.

ఇల్లందు పట్టణంలోని జే కే ప్రధాన రహదారి బస్టాప్ వెనుక బాగాన సుమారు 40 కోట్ల వ్యయంతో వంద పడకల ఆసుపత్రి నిర్మాణ పనులు శర వేగంగా జరుగుతున్న క్రమంలో ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య ఆస్పత్రి నిర్మాణ క్షేత్రస్థాయికి వెళ్లి శనివారం ఆస్పత్రి నిర్మాణ పనులను ఆసుపత్రి ఇంచార్జ్ సూపర్వైజర్ బాలకృష్ణ ను వివరాలను అడిగి తెలుసుకున్నారు. మూడు బ్లాకులతో గ్రౌండ్ ఫ్లోర్,ఫస్ట్ ఫ్లోర్ లతో నిర్మాణం అవుతున్న 100 పడకల ఆస్పత్రి ప్రధాన ముఖ ద్వారం సింగరేణి ఏ వన్ ఆఫీసర్స్ కోటర్స్ వైపుగ ఉంటుందని, వెనుకవైపు సంజయ్ నగర్ శివాలయం ఎదురుగా మరొక ద్వారం ఉంటుందని సూపర్వైజర్ బాలకృష్ణ ద్వారా వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ ఆస్పత్రి వెనుక బాగాన నివసిస్తున్న బాలాజీ నగర్, సంజయ్ నగర్, ఆజాద్ నగర్ ప్రజల రాకపోకలకు సంబంధించి ప్రధాన రహదారికి లింకు రహదారి కొరకు శాసనసభ్యులు కోరం కనకయ్య సమాలోచనలు చేశారు.

# తెలంగాణలో రైతు సంక్షేమం, అభివృద్ధి పనులపై ప్రభుత్వం కట్టుబడి ఉంది..

ఈ ఫ్యాక్టరీ ప్రజలది పాలకులు మారిన ప్రభుత్వం మారదు

ప్రజలను తప్పుదారి పట్టించే ఆరోపణలు ప్రతిపక్షాలు మానుకోవాలి

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

రైతులు ఆయిల్ ఫామ్ సాగుపై దృష్టి సారిస్తే లాభాలు పొందవచ్చు..

మంత్రి పొన్నం ప్రభాకర్

నర్మేట లో సీఎం సభ స్థలిని పరిశీలించిన మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు పొన్నం ప్రభాకర్

తెలంగాణలో రైతు సంక్షేమం, అభివృద్ధి పనులపై ప్రభుత్వం కట్టుబడి ఉందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా నర్మేటలో ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం జరగనుంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ అధికారులతో కలిసి ఏర్పాట్లను సమీక్షించారు.ముందుగా హెలిప్యాడ్ను పరిశీలించిన మంత్రులు, భద్రతా ఏర్పాట్లపై పోలీసులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఫ్యాక్టరీ ప్రాంగణం, రిఫైనరీ శంకుస్థాపన స్థలం, సభ వేదికలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన సుమారు 150 స్టాళ్లను కూడా వారు పరిశీలించారు.ఈ కార్యక్రమంలో



ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో పాటు ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి, సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ...32 ఎకరాల్లో సుమారు రూ.300 కోట్ల వ్యయంతో ఈ ఫ్యాక్టరీ నిర్మాణం జరిగిందని తెలిపారు. కేవలం 16 నెలల్లో పూర్తి చేయడం విశేషమని చెప్పారు. గంటకు 30 నుంచి 120 టన్నుల వరకు క్రషింగ్ సామర్థ్యం ఉన్న ఈ ఫ్యాక్టరీ రాష్ట్రంలో కీలకంగా మారుతుందని అన్నారు.ఇక్కడే ఆయిల్ రిఫైనరీ ఏర్పాటుతో రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేసి, తక్కువ సమయంలో చెల్లింపులు జరిపే విధానం అమలు చేయనున్నట్లు తెలిపారు. వెస్టేజ్ ద్వారా 4 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కూడా జరుగుతుందని వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు ఎల్లంపల్లి కీలకమని, ఈ ప్రాజెక్ట్ నిర్మాణం గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిందని గుర్తుచేశారు. అయితే, పెండింగ్లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రజలకు ఉపయోగపడేలా చేయడం ప్రతి ప్రభుత్వ బాధ్యత అని అన్నారు.నర్మేటలో ఏర్పాటు చేసిన ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని నిర్మించబడిందని తెలిపారు. ఈ ఫ్యాక్టరీ ప్రజల డబ్బుతో నిర్మించబడిన ప్రజా ఆస్తి అని, తెలంగాణ దేశంలో ఆయిల్ ఫామ్ ఉత్పత్తిలో ముందుండాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు.రైతులకు ఇచ్చిన హామీల అమలులో భాగంగా 2 లక్షల లోపు ఉన్న పంట రుణాలను ఒకేసారి మాఫీ చేశామని మంత్రి వెల్లడించారు. సుమారు 25 లక్షల మంది రైతులకు లాభం చేకూరేలా చర్యలు తీసుకున్నామని, దేశంలోనే ఒకేసారి భారీ స్థాయిలో రుణమాఫీ చేసిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని పేర్కొన్నారు. సాంకేతిక కారణాల వల్ల మిగిలిన వారికి కూడా అదనంగా నిధులు విడుదల చేశామని తెలిపారు.గత ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ, విడతల వారీగా రుణమాఫీ చేయడం వల్ల రైతులకు ప్రయోజనం చేకూరలేదని అన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం రైతు భరోసా, ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, తక్కువ ధరకు గ్యాస్ వంటి పథకాలను అమలు చేస్తోందని వివరించారు.కోహెడ ప్రాంతంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను రైతుల డిమాండ్ మేరకు ప్రారంభించామని తెలిపారు. ప్రజలను తప్పుదారి పట్టించే ఆరోపణలు మానుకోవాలని ప్రతిపక్షాలను కోరారు.రైతాంగ మహోత్సవాల సందర్భంగా నిర్వహించే కార్యక్రమాలకు రైతులు పెద్ద సంఖ్యలో హాజరవ్వాలని మంత్రి పిలుపునిచ్చారు. రైతు భరోసా కింద 3600వేల కోట్ల రూపాయలను విడుదల చేయనున్నట్లు వెల్లడించారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణలో ఆయిల్ ఫామ్ సాగును అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. రైతులు ఆయిల్ ఫామ్ సాగుపై దృష్టి సారిస్తే లాభాలు పొందవచ్చని చెప్పారు.

# డి ఎన్ సి వెంకన్న కర్మలకు హాజరైన ప్రముఖులు..

## పూలతో నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే రేగా, డీ సీ సి డైరెక్టర్ తుళ్లూరు బ్రహ్మయ్య.



మణుగూరు కు చెందిన ప్రముఖ మద్యం వ్యాపారి, డీ ఎన్ సి వెంకన్న గత పది రోజుల క్రితం గుండెపోటుతో మరణించిన విషయం అందరికీ తెలిసిందే.ఈ సందర్భంగా శుక్రవారం వెంకన్న దశ దిన కర్మలు స్థానిక హనుమాన్ గార్డెన్ లో జరిగాయి.కార్యక్ర మానికి హాజరైన ప్రముఖులు మాజీ ఎమ్మెల్యే రేగా కాంతా రావు,డీ సి సి డైరెక్టర్ తుళ్లూరు బ్రహ్మయ్య,ప్రముఖ కాంట్రాక్టర్ పి వి చారి,పినపాక సిండికేట్ నిర్వాహకులు వి టి రెడ్డి, పూజారి వెంకన్న,నారాయణ రెడ్డిలు మరియు కాంగ్రెస్ పార్టీ మండల,పట్టణ అధ్యక్షులు, నాయకులు పిరినాకి నవీన్,శివ సైదులు, పుచ్చకాయల శంకర్,జీవరత్నం,సి పి ఐ సీనియర్ నాయకులు సరెడ్డి పుల్లారెడ్డి,మున్నా లక్ష్మీ కుమారి,జంగం మోహన్ రావు, లక్ష్మీనారాయణ,లు పాల్గొని డి ఎన్ సి వెంకన్న చిత్ర పటానికి పూలతో ఘనంగానివాళుల ర్పించారు.అనంతరం వారు మాట్లాడుతూ మంచికి మారు పేరు డీ ఎన్ సి వెంకన్న,సాయం కోరి వచ్చే ప్రతి ఒక్కరికీ తనకు తోచిన సాయం చేసేవారని తెలిసింది,అలాంటి సేవచేసే గుణం ఉన్న వ్యక్తి లేని లోటు తీర్చలేనిదని ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు.వెంకన్న ఎక్కడున్నా వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపా రు.సిండికేట్ నిర్వాహకులు పెద్ద వెంకట్ రెడ్డి ( రెడ్డి),పులి వెంకన్నలు కార్యక్ర మానికి హాజరవుతున్న అతిథు లందరినీ సాధరంగా ఆహ్వానం పలికారు.అదే విధంగా బీ అర్ ఎస్ పార్టీ మణుగూరు అధ్యక్షు లు కుర్రి నాగేశ్వరరావు,మాజీ జెడ్పిటిసి పోశం నరసింహా రావు.టౌన్ ప్రెసిడెంట్ కుంట లక్ష్మణ్,పినపాక మండల అధ్యక్షుడు సతీష్,నూకరపు రమేష్,వట్టం రాంబాబు,దర్శ నాల శ్రీనివాస్,ఎడ్ల శ్రీనివాస్ ఆక్కినపల్లి నరసింహా రావు తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల్‌లో సివిల్ సర్వీసుల అవగాహన సదస్సు

## ఐఏఎస్, ఐపీఎస్ లక్ష్యంగా యువత ముందుకు రావాలి: ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

యువత ఐఏఎస్, ఐపీఎస్ వంటి అత్యున్నత సర్వీసులను లక్ష్యంగా పెట్టుకుని కృషి చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సూచించారు. సివిల్ సర్వీసుల ద్వారా దేశానికి సేవ చేయడంతో పాటు సమాజంలో గౌరవం, గుర్తింపు పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. బి.ఎల్.ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సిగ్నేచర్ ఐఏఎస్ అకాడెమీతో కలిసి మార్చి 22న (ఆదివారం) సివిల్ సర్వీసులపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా భారాసా నాయకులు సాయిజెన్ శేఖర్, సిగ్నేచర్ ఐఏఎస్ అకాడెమీ డైరెక్టర్ ఆర్.ఎస్. రెడ్డితో కలిసి ఎమ్మెల్యే సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.

# చిట్కుల్‌లో వెల్లివిరిసిన మత సామరస్యం...

రామాలయ ప్రాంగణంలో ముస్లిం సోదరులకు నీలం మధు రంజాన్ శుభాకాంక్షలు...

అరుదైన ఘటనకు చిట్కుల్ గ్రామం వేదిక అవ్వడం సంతోషకరం : నీలం..

కులం, మతం ఏదైనా మానవత్వం ఒక్కటేనని, భారతీయులందరూ సోదరభావంతో మెలగాలని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నీలం మధు ముదిరాజ్ అన్నారు.శనివారం రంజాన్ పండుగ పురస్కరించుకుని చిట్కుల్ మైనార్టీ సోదరులు నీలం మధు ముదిరాజ్ ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఒక అరుదైన ఘటన కు చిట్కుల్ గ్రామం వేదికగా నిలిచింది. నీలం మధు ముదిరాజ్ ఆధ్వర్యంలో చిట్కుల్‌లో జరుగుతున్న నూతన శ్రీ రామచంద్రస్వామి ఆలయ ప్రతిష్టా



కార్యక్రమాలు జరుగుతున్న వేదిక వద్ద పూజా పనుల్లో నిమగ్నమై ఉన్న నీలం మధును పవిత్ర రంజాన్ పర్వదినాని పురస్కరించుకుని స్థానిక ముస్లిం సోదరులు మర్యాదపూర్వకంగా కలిశారు. హిందూ ధర్మ సంప్రదాయాల ప్రకారం దేవాలయ ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్న తరుణంలో సంప్రదాయ దుస్తులలో ఉన్న నీలం మధు వద్దకు ముస్లిం సోదరులు చేరుకోవడం మత సామరస్యానికి అద్దం పట్టింది. వారిని సాదరంగా ఆహ్వానించిన నీలం మధు, ఆత్మీయంగా ఆలింగనం చేసుకుని రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ, పండుగలు ఏవైనా అవి మనుషుల మధ్య దూరాన్ని తగ్గించి, ప్రేమాభిమానాలను పెంచేవిగా ఉండాలని ఆకాంక్షించారు. ఒకవైపు రామాలయ పునఃప్రతిష్ట జరుగుతుండగా, అదే సమయంలో ముస్లిం సోదరులు వచ్చి రంజాన్ శుభాకాంక్షలు పంచుకోవడం గంగా-జమునా తెహజీబ్‌కు నిదర్శనమని ఆయన కొనియాడారు. భక్తి మార్గాలు వేరైనా లక్ష్యం ఒక్కటేనని, అందరూ కలిసిమెలిసి ఉన్నప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.దేవాలయ ప్రాంగణంలో చోటుచేసుకున్న ఈ ఆత్మీయ కలయిక స్థానికుల్లో అమితమైన ఆనందాన్ని నింపింది. రాజకీయాలకు అతీతంగా, అందరినీ కలుపుకుని పోయే నీలం మధు తీరును గ్రామస్తులు, ముస్లిం పెద్దలు ప్రశంసించారు ఈ కార్యక్రమంలో స్థానిక మైనారిటీ సోదరులు, ఆలయ నిర్వాహకులు, కాలనీ వాసులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు..

# ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన మాద్రి పృథ్వీరాజ్

పటాన్‌చెరు ఈద్గా వద్ద ముస్లిం సోదరులతో కలిసి రంజాన్ జరుపుకున్న బీఆర్ఎస్ నాయకులు మాద్రి పృథ్వీరాజ్ అందరికీ పవిత్ర ఈద్ ఉల్ ఫితర్ పండుగ శుభాకాంక్షలు తెలియజేసారు. పవిత్ర రంజాన్ మాసంలో నెల రోజుల పాటు భక్తి, నియమ నిష్టలతో ఉపవాస దీక్షలు ఆచరించి, ఆనందోత్సాహాలతో ఈద్ ఉల్ ఫితర్ పండుగను జరుపుకుంటున్న సందర్భంగా, పటాన్‌చెరు పట్టణంలోని ఈద్గా వద్ద బీఆర్ఎస్ నాయకులు, వీణ= ఫౌండేషన్ కో-ఫౌండర్ మాద్రి పృథ్వీరాజ్ ముస్లిం సోదరులను ఆప్యాయంగా కలిసి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పృథ్వీరాజ్ ముస్లిం సోదరులతో అలయ్ బలాయ్ చేసుకొని పరస్పర ప్రేమాభిమానాలు పంచుకున్నారు. అన్ని మతాల మధ్య సోదరభావం, పరస్పర గౌరవం పెంపొందించడం సమాజ ఐక్యతకు అత్యంత అవసరమని ఆయన పేర్కొన్నారు.పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు ఆచరించిన ఉపవాసాలు, ప్రార్థనలు అల్లాహ్ స్వీకరించి, సమాజంలో శాంతి, ఐక్యత, సౌభ్రాతృత్వం మరింత బలపడాలని ఆకాంక్షించారు.

Edited, Printed, Published & Owned by NATAVA KRISHNA RAO, Published from: Krishna Publications, 10-74, Main Road, Chandoor, (Post &Mandal) Nalgonda 508 255, Telangana, Printed at: Krishna Publications, 10-74, Main Road, Chandoor, (Post &Mandal) Nalgonda 508 255,Telangana, Editor:NATAVA KRISHNA RAO, Cell: 9440991979,